W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
8-11-2025



## సామినేని జ్ఞాపకాల్లో మునిగిపోయిన పాతర్లపాడు

నలభై ఏళ్లకుపైగా ప్రజా పోరాటాల సాక్షిగా నిలిచిన చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామం, నేడు తన ప్రియనేత సామినేని రామారావును గుర్తు చేసు కుంటూ మౌనంలో మునిగిపోయింది. ప్రజాసేవను జీవిత ధ్యేయంగా చేసుకున్న ఈ కమ్యూనిస్టు నాయకుడి హత్యతో గ్రామం చీకటిలో మునిగినట్లు మారింది. ఎర్రజెండా నీడలో పేదవాడి ఆశ్రయంగా నిలిచిన ఆయన జ్ఞాపకం, నేడు ప్రతి ఇంటి గుండె చప్పుడు లా మారింది.

09



09

# ప్రాణాలపైన పర్సంటేజీ రాజ్యం!

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యాపారం కోసమే వైద్యం

- కమీషన్ల లూటీలో కకావికలం అవుతున్న ప్రజారోగ్యం
- దినాభివృద్ధి చెందుతున్న వైద్య వ్యాపారం!
- ల్యాబ్‌లలో లూటీ, బిల్లుల్లో దౌర్జన్యం
- పేదల ప్రాణాలపై వేటకు ప్రభుత్వ ప్రోత్సాహం?

ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యుల సేవ, మానవత్వం, నిబద్ధత అనే పదాలకు ప్రతీకగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇప్పుడు వ్యాపార దాహంతో దహనమవుతోంది. వైద్యం నారాయణో అనే శాస్త్రోక్త భావం, ఈ రోజుల్లో నగదే హరి అనే దందా ధోరణిగా మారిపోయింది. ప్రతి ఆసుపత్రి గోడల వెనుక లాభాల లెక్కలు మోగుతున్నాయి, ప్రతి రోగి ప్రాణం కమీషన్ లెక్కల్లో కొలుస్తున్నారు. ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రతి పట్టణంలో ప్రైవేట్ హాస్పిటల్‌లు పుట్టెడు బొంగురుగా పెరిగాయి. కానీ పెరిగింది సేవ కాదు, పెరిగింది దోపిడీ ధోరణి. పేదలకు సేవ అనే బోర్డు వేసిన హాస్పిటల్ లోపల పర్సంటేజ్ లెక్కలు వేసే డాక్టర్లు, మేనేజ్‌మెంట్ ముఠాలు, ఆర్.ఎం.పి.లు నడిపే కమిషన్ రాకెట్.. ఇవే ఇప్పుడు వైద్య రంగం యొక్క అసలు ముఖచిత్రం.

### ల్యాబ్‌లలో లూటీ... టెస్టుల పేరుతో రక్తదోపిడీ

ఖమ్మం, పాల్వంచ, కొత్తగూడెం, వైరా, సత్తుపల్లి, మణుగూరు, భద్రాచలం ప్రాంతాల్లో ప్రతి వీధిలో ల్యాబ్‌లు కూకటివేళ్లలా ఉన్నాయి. వీటిలో చాలావరకు ప్రైవేట్ హాస్పిటల్‌ల సొంతం. ప్రతి టెస్టుకు ఫిక్స్‌డ్ పర్సంటేజ్ ఉంటుంది. బ్లడ్ టెస్ట్ ?500 అంటే, రోగి చెల్లించేది ?1,200. మధ్యలో వెళ్ళేది ల్యాబ్ అసిస్టెంట్, ఆర్.ఎం.పి., మరియు హాస్పిటల్ యజమానుల జేబుల్లో. రోగికి సాధారణ జ్వరం వచ్చినా "మీ లివర్, కిడ్నీ, థైరాయిడ్ చెక్ చేయాలి" అంటూ దర్జాగా టెస్టులు సూచిస్తారు. భయంతో రోగి టెస్టులు చేయించుకుంటాడు. చివరికి బిల్లు చూసి బుర్ర తిరుగుతుంది. ఈ టెస్టుల వ్యాపారం ఖమ్మం జిల్లాలో బంగారు బావులా మారింది.



05

## అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త

**ఖమ్మం, మహా:** శబరిమల అయ్యప్ప దర్శనాల సీజన్ సమీపిస్తున్న వేళ భక్తుల రవాణా సౌకర్యాల కోసం దక్షిణ మధ్య రైల్వే శుభవార్త తెలిపింది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి అయ్యప్ప భక్తుల సౌలభ్యం కోసం కొల్లం వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. చర్లపల్లి, నర్సాపూర్, మచిలీపట్నం నుంచి కొల్లం దాకా ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. నవంబర్ మధ్య నుంచి జనవరి మూడవ వారానికి ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి.




## వందేమాతరం గేయానికి 150 ఏళ్లు



దేశకీర్తిని, ఐక్యతను ప్రతిబింబించే వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా శుకవారం మణుగూరులో ఘనంగా గీతలాపన కార్యక్రమం నిర్వహించారు.

04

## క్యాన్సర్‌పై అప్రమత్తం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యాపారం కోసమే వైద్యం. కమీషన్ల లూటీలో కకావికలం అవుతున్న ప్రజారోగ్యం దినాభివృద్ధి చెందుతున్న వైద్య వ్యాపారం!


07



## ఘనంగా వందేమాతరం గీతాఆలాపన

**అశ్వాపురం, మహా:** మండల కేంద్రంలో గల ఎమ్మార్వో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున వందేమాతర గీతం 150 సం " పూర్తి చేసుకున్న సందర్భంగా తహసీల్దార్ మణిధర్ ఆధ్వర్యంలో గీత ఆలాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1875 నవంబర్ 7న ఈ గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించారు.ఇది దేశ భక్తికిమాతృభూమిపై ప్రేమకు ప్రతిక అన్నారు.వందేమాతర గీతం భారత స్వాతంత్ర పోరాటంలో ప్రజలను ఉత్తేజపరిచింది, విప్లవకారుల కు స్ఫూర్తినిచ్చింది , బ్రిటీష్ సామ్రాజ్యం కూల్చివేయటానికి సహాయపడింది. ఈ గీతం భాష,ప్రాంతం,కులం,మతం వంటి విభేదాలను అధిగమించి ప్రజలందరి ఏకం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సామూహిక వందేమాతరం గీతాలాపనలో పాల్గొన్న శ్రీజ



**ఖమ్మం,మహా:** శుక్రవారం వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం లో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలని తెలిపారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వందే మాతరం



**ఖమ్మం, మహా:** జాతీయ గీతం 'వందేమాతరానికి' 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా "వందే మాతరం" జాతీయ గేయాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షణలో ఖమ్మం పోలీస్ హెడ్ క్వాటర్స్ పరేడ్ గ్రౌండ్స్, అన్ని పోలీస్ స్టేషన్లలో ఘనంగా నిర్వహించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరగనున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు.

## ముత్యాలంపాడు జడ్పీ హైస్కూల్‌లో గీతాలాపన



**టేకులపల్లి - మహా:** భారత స్వతంత్ర ఉద్యమంలో సమరయోధుల గుండెల్లో దేశభక్తిని వందేమాతరం గీతం రగిలించింది ముత్యాలపాడు జడ్పీ హైస్కూల్ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ రామ్ చంద్రసింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక వందేమాతరం గీతాలపన కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు తేజావత్ శంభు నాయక్ నాయకులు రవి రాథోడ్ ధారావసింగ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# గుండ్ల సింగారం పేరుతో ఇసుక దందా!

- కనిపించని పీసా చట్టాలు..
- దందాపై రేణుక అక్షర మహిళా మండలి ఆగ్రహం..
- హైకోర్టును ఆశ్రయిస్తామని అధ్యక్షురాలు సరోజ హెచ్చరిక..



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుండ్ల సింగారం పేరుతో అక్రమంగా ఇసుక సొసైటీలు నడుపుతూ ఆదివాసీ సమాజాన్ని మోసం చేస్తున్నారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ మండిపడింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గుండ్ల సింగారం అనే గ్రామం పేరు ఇప్పుడు చెప్పుకుంటున్న వారు ప్రభుత్వ యంత్రాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆ గ్రామాన్ని 20 సంవత్సరాల క్రితమే సింగరేణి సంస్థ ఓసీ గనుల ఏర్పాటుకు భూసేకరణ ద్వారా సేకరించిందని, భూ నిర్వాసితులకు పరిహార ప్యాకేజీలు కూడా చెల్లించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఊరు లేని చోట ఊరి పేరునే వాడుతూ కొన్ని వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను భారీ యంత్రాలతో డంపింగ్ చేశారన్నారు. ఇది చట్ట విరుద్ధమైన చర్య అని విమర్శించారు. 1996 సవరణ చట్టం, 2011 పీసా యాక్ట్ ప్రకారం ఆ ప్రాంతంలో ఎటువంటి గ్రామ సభలు నిర్వహించకుండా, అధికారుల సంతకాలతో మతులు ఇవ్వడం చోద్యంగా ఉందన్నారు. టీజిఎండిసి అనుమతులు ఎలా ఇచ్చింది..? మైనింగ్, ఎమ్మార్వో, ఇరిగేషన్ తదితర విభాగాల అధికారులు ఏ విధంగా సహకరించారని ఆమె ప్రశ్నించారు. అసలు ఆ ప్రాంతంలో ఆ ఊరు ఉన్నదో లేదో చెప్పాలని, లేని పక్షంలో సర్వే విభాగం నుండి అధికారిక మ్యాపులు తెప్పించి ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులపై హైకోర్టులో రిట్ వేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎండి షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ, రెడ్డి బోయిన రేణుక, సౌజన్య డాకూరి, బాడిశ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి





**బూర్గంపహాడ్ మహా:** పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు.శుక్రవారం మండల కేం ద్రమైన బూర్గంపాడులో బిఆర్ఎస్ పార్టీ మం డల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమా న్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి ఎం ఎఫ్ టి (జిల్లా మినరల్ ఫౌండే షన్ ట్రస్ట్ ), సి ఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రె స్పాన్సిబిలిటీ )నిధులు జిల్లాకు, పినపాక ని యోజకవర్గానికి విడుదల చేసి అభివృద్ధి చే యాలని ఆయన అన్నారు.పినపాక నియోజక వర్గంలో ఉన్న రహదారులకు మరమ్మతులు చే పట్టాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ బూర్గంపాడు మండల సీని యర్ నాయకులు మేడగం లక్ష్మి నారాయణ రె డ్డి, మాజీ జడ్పీటీసీ భూపల్లి నరసింహారావు, ఉద్యమం కారుడు పొడియం నరేంద్ర,బీసీ సెల్ నాయకులు వీర్రాజు, ఎస్సీ సెల్ నాయకులు సాలయ్య, సారపాక టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలి శ్రీహరి,బాలి రెడ్డి,బురం శ్రీను, ఇసంపల్లి వెంకటేశర్లు,బానోత్ శ్రీను,కాకాని రాంబాబు,దా ర కార్తీక, రంజిత్ మహిళా నాయకులు, మాజీ రమణ, గుమ్మడి కృష్ణ వేణి, బర్ల బేబీ రాణి, చెక్క నరసింహ రావు తదితరులు పాల్గొన్నా రు.

## మాయదారి మద్యం

### అప్పుల వలలో చిక్కుకున్న వైద్యుడి దుర్మరణం





**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట పట్టణంలోని పాత ఆంధ్ర బ్యాంకు రోడ్డులో ఘోర ఘటన చోటుచేసుకుంది. మొలల వైద్యుడిగా స్థానికుల మన్నన పొందిన సర్కార్ న్యూటన్ కుమార్ (43) శుక్రవారం ఉదయం తన క్లినిక్‌లోనే ఉరివేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. కలకత్తాకు చెందిన న్యూటన్ కుమార్ సుమారు ఇరవై సంవత్సరాల క్రితం అశ్వారావుపేటకు వచ్చి, ఇక్కడ మొలల వైద్యం చేస్తూ స్థిరపడ్డాడు. మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకున్న ఆయన జీవితం చివరికి విషాదాంతమైంది. గత కొంతకాలంగా అతను మద్యం వ్యసనానికి గురై తీవ్రంగా మానసిక ఆవేదన అనుభవిస్తున్నాడని సమాచారం. మద్యం మాయలో మునిగిపోయి ఆహారం తీసుకోవడం కూడా మానేశాడని తెలిసింది. అంతేకాదు, అప్పులు కూడా అతడిని తీవ్ర ఒత్తిడికి గురి చేశాయని స్థానికులు చెబుతున్నారు. అప్పుల భారంతో, మద్యం బాధతో జీర్ణించుకోలేని స్థితికి చేరి, చివరికి తన ప్రాణాలకే తెగబడ్డాడు. ఈ ఘటన తెలుసుకున్న భార్య ఇద్దరు చిన్న పిల్లలతో క్లినిక్‌కు చేరుకుని మృతదేహం వద్ద బోరున విలపించడం హృదయ విదారకం. ఆ దృశ్యం చూసి స్థానికులు కన్నీళ్లు ఆపుకోలేకపోయారు.

# గాంధీనగర్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ కీలక సూచన
- పత్రాలు లేని 46 వాహనాలు స్వాధీనం





**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో శుక్రవారం పోలీసులు ప్రత్యేక "కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం" నిర్వహించారు.పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నివారణ లక్ష్యంగా విస్తృత కార్డెన్ సెర్చ్ చేపట్టారు.పోలీసు బృందాలు గాంధీనగర్‌లోని ప్రతి ఇంటిని,దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు (బైక్‌లు),4 ఆటోలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ గాంధీనగర్ ప్రాంతంలో వలసదారులు ఎక్కువగా నివసిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలు (డ్రగ్స్), గంజాయి బారిన పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని గట్టిగా హెచ్చరించారు.గంజాయికి అలవాటు పడి, పశ్చాత్తాపంతో ముందుకు వచ్చే వారికి ఉచితంగా చికిత్స,సేవలు అందించడానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.?నేరాలను అరికట్టడంలో భాగంగా ఇళ్లను అద్దెకిచ్చే యజమానులు తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాలని డీఎస్పీ సూచించారు.కొత్తగా ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు,అద్దెదారుల ఆధార్ కార్డుతో సహా పూర్తి వివరాలను సేకరించాలని,?అనుమానాస్పద వ్యక్తులు, అసాధారణ ప్రవర్తన గల అద్దెదారుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా గాంధీనగర్ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచడంతోపాటు నిబంధనలను పాటించడం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఎస్ఐలు మేడా ప్రసాద్, నాగబిక్షం సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు



**దమ్మపేట, మహా :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ యసై .సాయికిషోర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నేపద్యం లో శుక్రవారం మండలం లో వాహన తనిఖీలు చేస్తుండగా 20 మంది పట్టుబడ్డారు. వీరిని స్థానికంగా ఉన్న ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నందు హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో మెజిస్ట్రేట్ భవాని ఒకొక్కరికి వెయ్యి రూపాయల నగదు జరిమానా విదించారు. వారిలో ఇద్దరికి మూడురోజుల పాటు సాదారణ జైలు శిక్ష విదించారు. కాబట్టి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని యసై ప్రకటించారు. ఐనప్పటికీ కొందరు ఆకతాయిలు బరితెగించి వాహనాలు నడపడంతో అమాయకులైన పాదచారులు ,ప్రయాణీకులు ,మరెవరైనా ప్రణాలు కోల్పోయే పరిస్థితి లు ఉండవచ్చు నని యసై అన్నారు. రాష్ట్రం లో ఎన్నో ప్రమాదాలలో కారణాలు వెలికితీసినప్పుడు మద్యం సేవించడమే కారణంగా పేర్కొనడం తేలిందని అన్నారు. మీరు మద్యం సేవించి అతివేగంగా నడిపే వాహనాలతో మరొకరి కుటుంబాలు ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



# మా గ్రామ సమస్యను పరిష్కరించండి

## ఎంపీడీఓకి వినతి పత్రం అందజేసిన యువకులు

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి అన్నారపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం మండల అభివృద్ధి అధికారి పూరేటి అజయ్ కి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థ లేక చాలా కాలంగా వర్షపు నీరు అంతర్గత రోడ్లపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారటమే కాకుండా, దుర్గంధం వెదజల్లుతోందని, చాలా కాలంగా నిలువ ఉన్న నీటి వలన దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వారు వాపోయారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి కి, అధికార పార్టీ నాయకులతోపాటు, వైరా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. అయినా సమస్య ను ఎవరు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేని అధికార పార్టీ నాయకులు మరి ఎవరి కోసం పనిచేస్తున్నారని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ అజయ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉపేందర్, గణేష్, నవీన్, బాలు, మంజు ఉన్నారు.



# సామూహిక దేశభక్తి గీతాలాపన



**జూలూరుపాడు, మహా:** "వందేమాతరం"గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ 150వ జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు, పాఠశాలల్లో "వందేమాతరం"గీతం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహించారు. గీతాలాపన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.."వందేమాతరం"గీతం మన జాతీయ చైతన్యానికి ప్రతీకగా, స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణగా నిలిచిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా దేశవ్యాప్తంగా ఈ వేడుకల నిర్వాహణలో భాగంగా జూలూరుపాడు మండల వ్యాప్తంగా దేశభక్తి భావం ప్రతి ధ్వనించింది.





# అశ్వారావుపేటలో విద్యార్థుల సామూహిక గీతాలాపన



**అశ్వారావుపేట, మహా:** దేశవ్యాప్తంగా వందేమాతర గీతం పుట్టి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు శుక్రవారం అశ్వారావుపేట పట్టణంలో సామూహిక గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఆనందమఠం నవలలో చోటుచేసుకున్న వందేమాతర గీతం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పోరాట స్ఫూర్తిని రగిలించింది. స్థానిక వికేడీవి కాలేజీ, గౌతమి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బిజెపి నాయకులు పాల్గొని వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
8-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం



**మణుగూరు, మహా:** అమరవీరుల ఆశయ సాధనకై నిరంతర పోరాటం అవసరమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంద) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. నవంబర్ 1 నుండి 9 వరకు జరుగుతున్న అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాలలో భాగంగా మణుగూరులోని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, దోపిడీ, పీడనలు లేని సమ సమాజం నిర్మాణం కోసం ఎందరో అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి ఆశయాల సాధనకై మనం కూడా కట్టుబడి పోరాడాలన్నారు. ధనిక%–%పేద బేధం లేని సమాజం నిర్మాణమే వారికిచ్చే నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కాంపాటి పృథ్వీ, నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, జానయ్య, మిట్టపల్లి రాజేందర్, మల్లెల రామయ్య, జే యాకయ్య, సతీష్, నరసింహారావు, రాజు, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంజనాపురం గ్రామానికి చెందిన షేక్ ఖాసీం కు రూ. 8,000 ఆర్థిక స హాయం అందజేశారు. ఇతనది నిరుపేద కు టుంబం కావడంతో కూలీ పనులకు వెళ్ళేవా డు . ఇతనికి బార్య ,కుమారుడు,కుమార్తె తల్లి అభిదా వున్నారు. ఇతను కూలి పని చేస్తే కాని పూట గడవని పరిస్థితి వారిది . గత నెల రో జుల క్రితం తమ్ముడు చనిపోవడంతో మనస్థాపంకు గురైన ఖాసీం అనారోగ్యంగా ఉన్న కానీ పట్టించుకోలేదు. దీంతో తన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం లోని ప్రైవేటు హాస్పిటల్ కు తీసుకు వెళ్ళడం జరిగింది. అక్కడ వైద్య పరిక్షలు నిర్వ హించగా గుండె,ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులతో సరిగా శ్వాస తీసుకోలేక పోతు న్నాడని వెంటనే వెంటిలేటర్ పై చికిత్సా అం దించాలని, సుమారుగా 6 లక్షలు వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ విష యం గ్రామస్తులు నేస్తం ట్రస్ట్ దృష్టికి తీసుకు రా వడంతో రూ 8,000 ఆర్థిక సహాయంనుఅందిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అం కిరెడ్డి,గౌరవ సలహాదారులు సంకా సురేష్ , సభ్యులు ఆవుల నాగార్జున, డి బాలనారాయ ణ రెడ్డి, గ్రామస్థులు ఆరుట్ల రాఘవ చారి పాల్గొన్నారు.

# వందేమాతరం గేయానికి 150 ఏళ్లు

## దేశభక్తి గీతంతో మార్మోగిన మణుగూరు

**మణుగూరు, మహా:** దేశకీర్తిని, ఐక్యతను ప్రతిబింబించే వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం మణుగూరులో ఘనంగా గీతలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు తాసిల్దార్ నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు కూచిపూడి బాబు తదితరులు వందేమాతర గీతాన్ని సమూహంగా ఆలపించి దేశభక్తి భావాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వందేమాతరం గేయం మనకు దేశభక్తిని, ఏకత్వాన్ని గుర్తుచేసే శాశ్వత గీతమన్నారు. యువతరం ఈ గీతంలోని స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశం కోసం త్యాగం చేసిన మహానుభావుల తాలూకు జ్ఞాపకాలను తరతరాలకు అందించాల్సిన బాధ్యత మనంద రిదని పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలోని రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, అటవీ శాఖలతోపాటు వివిధ విభాగాలలో వందేమాతరం గీతాన్ని అధికారులు సిబ్బంది ఆలపించారు.



### ఓపెన్ హెల్త్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం ప్రాథమిక పాఠశాలలో ఆవరణలో ఓపెన్ హెల్త్ జిమ్ ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించి ప్రతి ఒక్కరు పర్యట వ్యాయామం చేయాలని తద్వారా ఆరోగ్యవంతులుగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం ఆకాంక్షించారు. వాటర్ ట్యాంక్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం. మణుగూరు సమితి సింగారం అరుంధతి నగర్ లో రూ.30 లక్షల అంచన వ్యయంతో కూడిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# గీతాలాపన పేరుతో మౌనాలాపన

- వందేమాతర ఆత్మను మింగిన అధికార నిర్లక్ష్యం
- కేంద్రం సామూహిక గీతాలాపన ఆదేశించగా తహసీల్దార్ కార్యాలయంలో బ్లూటూత్ కార్యక్రమం
- ఆలపించాల్సిన చోట వినిపించుకున్న అధికారులు - మ్యూట్ మోడ్‌లో దేశభక్తి
- పాట పాడమంటే ప్లే చేశారు.. గళం కలపమంటే మ్యూట్ నొక్కేశారు అంటూ వ్యంగ్యాలు

**అశ్వారావుపేట,మహా:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వందేమాతర గీతం పుట్టి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సామూహిక గీతాలాపన నిర్వహించాలని స్పష్టంగా ఆదేశిం చింది. అయితే అశ్వారావుపేట తహసీల్దార్ కార్యా లయంలో మాత్రం ఆ ఉద్దేశం తలకిందులైందని చెప్పాలి. గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సూచించిన చోట, అధికారులు బ్లూటూత్ సౌండ్ బాక్స్ పెట్టి వందేమాతర గీతాన్ని ప్లే చేసి మౌనంగా నిలబడ్డారు. ఆలపించాల్సిన గీతాన్ని వినటమే కర్తవ్యం అనుకున్నట్టుగా వారి వైఖరి కనిపించింది. పాట పాడమంటే ప్లే చేశారు. గళం కలపమంటే మ్యూట్ బటన్ నొక్కేశారు అంటూ స్థానికులు వ్యంగ్యంగా స్పందించారు. వందేమాతర గీతం దేశభక్తి జ్వాల రగిలించా ల్సిన సందర్భంలో అధికారులు చూపిన నిర్లక్ష్యం ప్రజల్లో అసహనం రేపింది. దేశమాతను కీర్తించాల్సిన చోట మౌనమాతను ఆరాధించారు అంటూ పలువురు విమర్శించారు. కేంద్రం ఉద్దేశం దేశభక్తి స్ఫూర్తిని రగిలించడం కాగా, రాష్ట్ర స్థాయిలో అది బ్లూటూత్ బాక్స్ కార్యక్రమంగా మారిపోయిందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. ప్లే చేసిన వందేమాతరానికి వాళ్లు కోరస్‌గా గొంతు కలిపి పాడితే బాగుండేది అంటూ మరికొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.





# అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త

- తెలుగు రాష్ట్రాల నుంచి కొల్లానికి ప్రత్యేక రైళ్లు
- చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి కొల్లం వరకు స్పెషల్ సర్వీసులు
- అయ్యప్ప మాలధారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- నవంబర్ 14 నుంచి జనవరి 21 వరకు అందుబాటులోరైళ్లు

**ఖమ్మం, మహా:** శబరిమల అయ్యప్ప దర్శనాల సీజన్ సమీపిస్తున్న వేళ భక్తుల రవాణా సౌకర్యాల కోసం దక్షిణ మధ్య రైల్వే శుభవార్త తెలిపింది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి అయ్యప్ప భక్తుల సౌలభ్యం కోసం కొల్లం వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. చర్లపల్లి, నర్సాపూర్, మచిలీపట్నం నుంచి కొల్లం దాకా ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. నవంబర్ మధ్య నుంచి జనవరి మూడవ వారానికి ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి.

### చర్లపల్లి-కొల్లం రైలు సర్వీసులు

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం చర్లపల్లి–కొల్లం (07107) ప్రత్యేక రైళ్లు నవంబర్ 17, 24, డిసెంబర్ 1, 8, 15, 22, జనవరి 5, 12, 19 తేదీల్లో నడుస్తాయని రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొల్లం చేరుతాయి. తిరుగు ప్రయాణం కొల్లం%–%చర్లపల్లి (07108) రైళ్లు నవంబర్ 19, 26, డిసెంబర్ 3, 10, 17, 24, 31, జనవరి 7, 14, 21 తేదీల్లో నడుస్తాయి. ఇవి ప్రతి బుధవారం ఉదయం 2.30 గంటలకు కొల్లం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు గమ్యస్థానం చేరుతాయి.

### ఈ రైళ్ల మార్గమధ్య స్టేషన్లు

చర్లపల్లి–కొల్లం రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడె, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూర్, పాలక్కడ్, త్రిస్సూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, కాయకులం స్టేషన్లలో ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

### నర్సాపూర్-కొల్లం రైలు వివరాలు

నర్సాపూర్–కొల్లం (07105) రైలు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 7, 14, 21, 28, జనవరి 4, 11, 18 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొల్లం చేరుతుంది. తిరుగు ప్రయాణ రైలు కొల్లం%–%నర్సాపూర్ (07106) నవంబర్ 18, 25, డిసెంబర్ 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో నడుస్తుంది. ప్రతి ఆదివారం వేకువ జామున 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గమ్యస్థానం చేరుతుంది.



నర్సాపూర్ రైలు మార్గం

ఈ రైళ్లు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కడ్, త్రిస్సూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూర్, కాయంకులం స్టేషన్లలో ఆగుతాయి.

### మచిలీపట్నం-కొల్లం రైళ్లు కూడా అందుబాటులో

మచిలీపట్నం–కొల్లం (07101) రైళ్లు నవంబర్ 14, 21, 28, డిసెంబర్ 26, జనవరి 2 తేదీల్లో నడుస్తాయని రైల్వే తెలిపింది. ఇవి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు గమ్యస్థానం చేరుతాయి. తిరుగు ప్రయాణంలో కొల్లం%–%మచిలీపట్నం (07102) రైళ్లు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 28, జనవరి 3 తేదీల్లో నడుస్తాయి. ఇవి వేకువ జామున 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు గమ్యస్థానం చేరుతాయి.

### మచిలీపట్నం రైలు ఆగే స్టేషన్లు

ఈ రైళ్లు విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కడ్, త్రిస్సూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూర్, కాయంకులం స్టేషన్లలో ఆగుతాయి.

### భక్తులు వినియోగించుకోవాలని రైల్వే విజ్ఞప్తి

దక్షిణ మధ్య రైల్వే అధికారులు అయ్యప్ప భక్తుల సౌకర్యం కోసం ఈ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు తమ ప్రయాణాల ప్రణాళికను ముందుగానే రూపొందించుకొని, ఈ ప్రత్యేక సర్వీసులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలని రైల్వే శాఖ సలహా ఇచ్చింది.

# నవంబర్ నెలాఖరు లోపు చేప పిల్లలను విడుదల చేయాలి

## జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం,మహా:** నవంబర్ నెలాఖరు లోపు లక్ష్యం మేరకు చేప పిల్లలను విడుదల చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో చేప పిల్లల పంపిణీ చేసే డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ను పరిశీలించారు. అనంతరం ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మండల స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల సజావుగా జరగాలని అన్నారు. ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో 28 వేల 800 చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉన్నదని, రవ్వ, బొచ్చ, బంగారు తీగ రకాల చేప పిల్లలను శుక్రవారం నల్ల చెరువులో విడుదల చేయడం జరిగిందని, అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని 38 చెరువులలో 9.5 లక్షల చేప పిల్లలు నెలాఖరు లోపు విడతల వారీగా విడుదల చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఎంపిడిఓ కె. రవికుమార్, ఎంపీవో శ్రీదేవి, ఫిషరీస్ మండల ఇంచార్జ్ లు నవీన్, లక్ష్మణ్, సరిత, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# సింగరేణి ఏరియాలో వందేమాతర గీతం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వందేమాతర గీతం రచించి నేటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం వందేమాతరం గీతం సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పిలుపు ఇచ్చినా కూడా సింగరేణి ఆచరించి చేయడంలో సింగరేణి ముందు వరుసలో ఉంటుందని అన్నారు. కొత్తగూడెం ఏరియా జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ఓటు జిఎం జివి.కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణ రాజు, ఎజిఎం(సివిల్) సిహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.



# లైసెన్స్ లేని పత్తి వ్యాపారస్తులకు నోటీసులు

**కారేపల్లి, మహా:** కారేపల్లి లైసెన్స్ లేకుండా పత్తి వ్యాపారం చేస్తున్న వ్యారస్తులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఇల్లందు మార్కెట్ పరిధిలోని వ్యాపారస్తులు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోని పత్తి, ఇతర పంటలను కొనుగోలు చేయాలని అవగాహన కల్పించినా వ్యాపారస్తులు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ కార్యదర్శి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పత్తి కౌంటర్ల పై దాడి చేసి వారికి నోటీసులు ఇవ్వటంతోపాటు నిల్వఉన్న పత్తికి మార్కెట్ ఫీజు వసూలు చేశారు. కాంటాలను స్వాధీనం చేసుకోని ఇల్లందు మార్కెట్‌కు తరలించారు.



# సాధన కళాశాలలో చైతన్యం అవగాహన కార్యక్రమం

**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని సాధన జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు స్థానిక సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై రవితో కలసి “చైతన్యం” డ్రగ్స్ పై యుద్ధం అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీలక్ష్మి విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్ వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని, దాని నుండి బయటపడడం చాలా కష్టమని తెలిపారు.



# జిల్లా వైద్యశాఖలో కలకలం




**ఖమ్మం, మహా:** జిల్లా వైద్యారోగ్యశాఖలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇంచార్జీ డీఎంఅండ్ హెచ్ ఓగా బాధ్యతలు చేపట్టిన కొత్త అధికారి ప్రవర్తన, వ్యాఖ్యలు, చర్యలు సిబ్బందిలో గందరగోళానికి కారణమయ్యాయి. నాకే డీఎంఅండ్ హెచ్ ఓ వస్తుంది... నేనే ఉంటాను... నాకు పైస్థాయిలో నెట్‌వర్క్ ఉంది అంటూ సిబ్బందిముందే పెద్ద పెద్ద మాటలు మాట్లాడటంతో వైద్యవర్గాల్లో ఆగ్రహం ఉధృతమైంది. ఈ హడావిడి వెనుక ఉన్న గుట్టు, కమిటీల మాయాజాలం, కలెక్షన్ల ఆరోపణలు ఇప్పుడు ప్రజల్లోనూ చర్చనీయాంశమయ్యాయి.

### అధికారపు హడావిడి..సిబ్బందిలో చర్చ

ఈ నెల 1వ తేదీ నుంచి ఖమ్మం డీఎంఅండ్ హెచ్ ఓ కార్యాలయంలో ఇంచార్జీగా పనిచేస్తున్న అధికారి, బాధ్యతలు చేపట్టిన తొలి రోజునుంచే హడావిడి మొదలుపెట్టినట్లు సిబ్బంది చెబుతున్నారు. "నాకే ఈ పోస్టు వస్తుంది... నాకు పై అధికారులతో నెట్‌వర్క్ ఉంది" అంటూ తెగ గర్వంగా చెప్పినట్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తన మాటే చివరి, తన నిర్ణయమే ఆఖరి అన్నట్టు వ్యవహరిస్తూ సిబ్బందిని బెదిరించడమే కాకుండా, తనకు అనుకూలంగా ఉన్నవారిని టీమ్‌గా ఏర్పరచుకున్నట్లు సమాచారం.

### గత చరిత్ర వివాదాస్పదమే

ఈ అధికారి ఎక్కడ పనిచేసినా వివాదాలు వెంటాడాయనే ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ వైద్యారోగ్యశాఖ కమిషనరేట్‌లో పనిచేసినప్పుడు, అధికారులను "చేయి తడిపి" ఎంక్వైరీ రిపోర్టులు మార్పించుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. తన పదవిని ఉపయోగించి సిబ్బందిని వేధించడం, కక్షపూరిత చర్యలు తీసుకోవడం, డిప్యూటేషన్ల పేరుతో వసూళ్లు చేయడం వంటి చర్యలు కూడా అప్పట్లో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు ఖమ్మంలోనూ అదే పద్ధతి కొనసాగుతోందని సిబ్బంది అంటున్నారు.

### తనిఖీ కమిటీలు..ఆర్డర్ కాపీ చుట్టూ వివాదం

ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ కమిటీ ఏర్పాటు పేరుతో ఒక ఆర్డర్ కాపీ విడుదల చేశారు. అయితే ఆ కమిటీలో తన అనుచరులను మాత్రమే చేర్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం సెలవులో ఉన్న అధికారి ఆదేశాలు లేకుండానే ఆగమేఘాల మీద ఆర్డర్ విడుదల చేశారు. అదీ ఇంచార్జీ డీఎంఅండ్ హెచ్ ఓగా కాకుండా రెగ్యులర్ డీఎంఅండ్ హెచ్ ఓగా సంతకం చేయడం మరింత వివాదానికి దారితీసింది. ఆ కాపీ ఆధారంగా కమిటీలో ఉన్న ఇద్దరు ముగ్గురు హాస్పిటల్స్‌కి వస్తున్నామంటూ మెసేజ్లు పంపినట్టు సమాచారం.

### ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి కలెక్షన్ల ఆరోపణలు

ఇంచార్జీగా బాధ్యతలు చేపట్టిన కేవలం ఏడు రోజుల్లోనే ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి భారీగా వసూళ్లు జరుగుతున్నాయని సిబ్బంది ఆరోపిస్తున్నారు. తనిఖీ కమిటీ పేరుతో కొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి, లైసెన్సులు, రికార్డుల పేరుతో బెదిరింపులు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కమిటీ డ్రామా వాస్తవానికి వసూళ్లకే పునాది వేసిందని ఆరోగ్యశాఖలో అంతర్గత చర్చ నడుస్తోంది.

### సిబ్బందిపై కక్షలు..ఇష్టానుసార పాలన

తనకు అనుకూలంగా లేని సిబ్బందిని పక్కకు తొలగించడం, డిప్యూటేషన్లను అడ్డుకోవడం, ఎవరికి ఏ పని అప్పగించాలో వ్యక్తిగత వైఖరితో నిర్ణయించడం వంటి చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు ముగ్గురు సీనియర్ ఉద్యోగులను నిర్దిష్ట కారణం లేకుండా తిడుతూ, అవమానకరంగా మాట్లాడినట్లు సిబ్బంది చెబుతున్నారు. "ఈ సార్ దగ్గర పనిచేయడం అంటే నరకం అనుభవించడం" అని కొందరు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### కలెక్టర్ జోక్యం అవసరం

జిల్లాలో ప్రజలు కూడా ఈ వ్యవహారం గురించి మాట్లాడుకుంటున్నారు. ఆరోగ్యశాఖలో ఇలాంటి ప్రవర్తన కొనసాగితే ప్రజాసేవలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీల పేరుతో కలెక్షన్లు జరగడం, అధికార పదవిని దుర్వినియోగం చేయడం, సిబ్బందిని కక్షపూరితంగా టార్గెట్ చేయడం వంటి అంశాలపై కలెక్టర్ తక్షణం విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### నిష్పాక్షిక చర్యలపై ఆశ

ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్వయంగా దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సిబ్బంది నమ్ముతున్నారు. పత్రాల ఆధారంగా, ఆర్డర్ కాపీలను పరిశీలిస్తే అనేక అవకతవకలు బయటపడతాయని వారు చెబుతున్నారు. జిల్లా ఆరోగ్య వ్యవస్థ పునరుద్ధరణ కావాలంటే ఇలాంటి అధికారులను తక్షణం క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వైద్యవర్గాల్లో బలపడుతోంది.

## కొత్తగూడెంలో జరిగే "మెగా జాబ్ మేళా" పోస్టర్ ఆవిష్కరణ



**భద్రాద్రి బ్యూరో, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 16వ తేదీన జరిగే "మెగా జాబ్ మేళా" పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరి గింది. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు మాట్లాడుతూ కొత్తగూడెం క్లబ్ ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన "మెగా జాబ్ మేళా" జరుగునుందని ఈ జాబ్ మేళా కార్యక్రమం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా సింగరేణి వారి సహకారంతో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రైవేట్ కంపెనీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై జీవనభృతికి అవసరమైన ఉద్యోగాలను పొందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేం రాజుతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జున రావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎస్ఓటు జీఎం జీవి కోటిరెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణి హెడ్ఆఫీస్‌లో వందేమాతరం గీతాలాపన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వందేమాతర గీతం రచించి నేటికీ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జీ.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన సింగరేణి ప్రధాన కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు అందరూ కలిసి సామూహిక వందేమాతర గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తముగా నిర్వహించే సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించాలనే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సింగరేణి వ్యాప్తముగా అన్నీ ఏరియాలలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు.

## ప్రజా పోరాటాలలో అనసూర్య కీలక పాత్ర

**కారేపల్లి, మహా :** ప్రజాపోరాటాలలో దారావత్ అనసూర్య కుటుంబం కీలక పాత్ర పోషిస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావులు అన్నారు. కారేపల్లి మండలం మాణిక్యారం (గుడితండా)లో సీపీఐ(ఎం) శాఖ సభ్యులు, గిరిజన సంఘం నాయకులు ధరావత్ వశ్యానాయక్ సతీమణి అనసూర్య ఇటీవల అనారోగ్యంతో మఅతి చెందారు. ఆమె సంస్మరణ సభ వజ్జా రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ మాణిక్యారం ప్రాంతంలో సీపీఐ(ఎం) నిర్వహించే అనేక ఉద్యమ పోరాటం దారావత్ వశ్య నాయక్, అతని సతీమణి అనసూర్యలు ముందుండేవారన్నారు. భర్త వశ్యానాయక్ తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడి పని చేయుటలో అనసూర్య సంపూర్ణ సహకారం అందిస్తూ ప్రోత్సహించేవారన్నారు. అనసూర్య మఅతి కుటుంబానికే కాక సీపీఐ(ఎం)కు తీరని లోటన్నారు. మాణిక్యారం, చీమలపాడు ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర పేదలు పోడు భూమి పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పేదల పోడు రక్షించటానికి జైలు, పోలీసు కేసులు పారెస్టు నిర్భంధాలు లెక్కచేయకుండా సీపీఐ(ఎం)



చేసిన పోరాట ఫలితంగా నేడు పోడు సాగు జరుగుతుందన్నారు. రైతాంగ, గిరిజన, మహిళ, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహించేది ఎర్రజెండామాత్రమే అనిఅన్నారు. ఎర్రజెండా సిద్ధాంతాన్ని నమ్మిన అనసూర్య ఆశయ సాధన కోసం కఅషి చేయాలన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాబోయే కాలంలో చేపట్టబోయే కార్యక్రమాల్లో ప్రజలందరూ కలిసి రావాలని వారు పిలుపునిచ్చారు. అంతకు ముందు అనసూర్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు మెరుగు రమణ, మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు కొండబోయిన ఉమావతి, కరపటి సీతారాములు. కల్తీ రామచంద్రయ్య, పోతర్ల నాగేశ్వరరావు, భూక్య రమేష్, చల్ల మల్లమ్మ, పాయం వరలక్ష్మి, సాగబోయి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ లు కరపటి సీతమ్మ, ధారావత్ కిషన్,భూక్య సైదా, భూక్య రంగారావు, డీసీసీబీ డైరెక్టర్ దారావత్ బద్దులాల్, కొత్తూరి రామారావు, బిఆర్ఎస్ యువజన నాయకులు ధారావత్ వికాస, అనసూర్య భర్త దారావత్ వశ్యా నాయక్ కుమార్తె శ్రావణి, అల్లుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అండర్-14 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో

# మెరిసిన ఖమ్మం జట్టు

## వికారాబాద్ వేదికగా ఖమ్మం బాలుర ఫుట్‌బాల్ ఘనత

- ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్ విద్యార్థుల కీర్తి పతాకం
- ఖమ్మం యువ ఆటగాళ్ల ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు
- ఫుట్‌బాల్‌లో మూడో స్థానం సాధించిన ఖమ్మం జట్టుకు అభినందనల వెల్లువ




ఖమ్మం, మహా: వికారాబాద్‌లో నవంబర్ 3 నుండి 5 వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర అండర్–14 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టు అద్భుత ప్రతిభతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా తరపున పాల్గొన్న ఆటగాళ్ల సమన్వయం, శ్రద్ధ, నిబద్ధత ఈ విజయానికి దోహదం చేసింది.



### వికారాబాద్ వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి ఎంపికైన బాలుర జట్లు పాల్గొన్న ఈ అండర్–14 ఫుట్‌బాల్ టోర్నమెంట్ మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. వికారాబాద్ క్రీడా మైదానం పసిప్రతిభల ఆటతీరు, క్రీడాస్ఫూర్తికి సాక్ష్యమైంది. ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగగా, ప్రేక్షకులు కూడా అపారమైన ప్రోత్సాహాన్ని అందించారు.

### ఖమ్మం జట్టు అద్భుత ప్రదర్శన

ఖమ్మం జిల్లా జట్టు తొలి మ్యాచ్ నుంచే దూసుకెళ్లి ప్రత్యర్థి జట్లను తలదన్నింది. జట్టు సమన్వయం, రక్షణాత్మక ఆటతీరు, సరిగ్గా సమయానుకూలంగా చేసిన గోల్స్ జట్టుకు గౌరవప్రదమైన స్థానాన్ని అందించాయి. సెమీఫైనల్‌లో కొద్దిపాటి తేడాతో ఓటమి పాలైనప్పటికీ, ఖమ్మం జట్టు తన పోరాట స్ఫూర్తిని నిలబెట్టుకుంది.

### ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం తరపున ఆడిన ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కు చెందిన ఆటగాళ్లు తనిష్క్ పాల్, హార్దిక్, మణిచంద్రలు తమ సత్తాను చాటారు. ఈ ముగ్గురు ఆటగాళ్ల క్రమశిక్షణ, వేగం, గేమ్ అవగాహన జట్టుకు బలాన్నిచ్చాయి. ముఖ్యంగా తనిష్క్ పాల్ ఫార్వర్డ్ లైన్‌లో చేసిన ఆ????ణాత్మక ఆట ప్రేక్షకులను ఆకట్టుకోగా, హార్దిక్ రక్షణలో జట్టుకు మద్దతుగా నిలిచాడు. మణిచంద్ర మిడ్‌ఫీల్డ్‌లో సమతౌల్యాన్ని అందించాడు.

### ప్రశంసల వర్షం కురిపించిన క్రీడా వర్గాలు

ఖమ్మం జట్టు ప్రదర్శనపై జిల్లా క్రీడా అధికారులు, కోచ్‌లు, క్రీడా అభిమానులు ప్రశంసలు కురిపించారు. "ఈ విజయంతో జిల్లాలోని పాఠశాల స్థాయి క్రీడాకారులకు ప్రేరణ లభించింది. ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఉన్న యువతకు ఇది మార్గదర్శక ఘట్టం అవుతుంది," అని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.

### జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అభివృద్ధికి ప్రేరణ

ఈ విజయం జిల్లా స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడను మరింత బలోపేతం చేసే అవకాశం కల్పించింది. ఖమ్మం జిల్లా క్రీడా శాఖ ఇప్పటికే పలు గ్రామ పంచాయతీల స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడా మైదానాల అభివృద్ధి, కోచింగ్ శిబిరాల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టింది. యువతలో ఫుట్‌బాల్ పట్ల ఆసక్తి పెరుగుతుండడం క్రీడాభివృద్ధికి సంకేతమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా జట్టు ఈ విజయంతో రాష్ట్రస్థాయిలో తన ప్రతిభను నిరూపించుకుంది. బాలుర అండర్-14 వయోపరిమితి గల ఈ టోర్నమెంట్‌లో ఖమ్మం ఆటగాళ్లు చూపిన కృషి, క్రమశిక్షణ, ఆటపట్ల ఉన్న అభిరుచి భవిష్యత్తులో మరిన్ని విజయాలకు మార్గం సుగమం చేస్తుందనడంలో సందేహం లేదు.

## ప్రజలలో దేశభక్తిని పొంగి పొరలించే వందేమాతరం గీతం



భద్రాద్రి కొత్తగూడెం, మహా: ప్రజలలో దేశభక్తిని పొంగి పొరలించే వందేమాతరం గీతమని నిమ్మలగూడెం ప్రభుత్వ పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. మన జాతీయ దేశభక్తి గీతమైన వందేమాతరంకు 150 సంవత్సరాలు నిండిన సందర్భంగా శుక్రవారం అన్ని విద్యాసంస్థలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలందరూ కూడా వందేమాతర గీతం ఆలపించిన కార్యక్రమంలో నేపథ్యంలో నిమ్మలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, సహ ఉపాధ్యాయులు ఎండి షఫీ అహ్మద్, విద్యార్థిని విద్యార్థులు అందరూ కలిసి వందేమాతర గీతం హృద్యంగా ఆలపించి ఆ గీతానికి గౌరవాన్ని ఆపాదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ నిరసన



భద్రాద్రి కొత్తగూడెం, మహా: కొత్తగూడెం నియోజ కవర్గంలోని రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసన చేస్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో(డీఎంఎఫ్) నిధులను సద్వినియోగం చేసుకోవడంలో ప్రజా ప్రతినిధి విఫలమయ్యారన్నారు. పట్టణంలో రోడ్లకు మరమ్మతులు చేసే దిక్కు లేదని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి డీఎంఎఫ్ నిధులను వేరే ప్రాంతాలకు కాంగ్రెస్ నాయకులు తరలించుకు పోతున్నప్పటికీ స్థానిక ప్రజా ప్రతినిధి పట్టనట్టు ఉండటం సరికాదన్నారు. ప్రజా పాలన, అభయ హస్తం అంటూ సీఎం రేవంత్ రెడ్డి పాలన ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి సమస్యలు పరిష్కరించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజుగౌడ్, సింధు తపస్వి, పోతురాజు రవి, చందు నాయక్, జయరాం నాయక్, అఖిల్ మహర్షి, లావుడ్య పూర్ణ, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ కార్యాలయాన్ని ముట్టడించిన బిఆర్ఎస్



అశ్వారావుపేట, మహా: అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బిఆర్ఎస్ నాయకులు ముట్టడించారు. జిల్లా అధ్యక్షు డు రేగా కాంతారావు పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నేతృత్వంలో ఐదు మండలాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని రహదారులు ప్రమాదకర స్థితిలోకి మారినా, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదు. డి ఎం ఎఫ్ టీ, సి ఎస్ ఆర్ నిధుల వినియోగంపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు దారితీస్తోంది, అని అన్నారు. పట్టణంలో 23 కోట్ల రూపాయల సెంట్రల్ లైటింగ్ పనులు రెండేళ్లుగా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారులపై రాళ్లు ఎగిరిపడి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సరఫరా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, చెత్త సేకరణ నిలిచిపోవడం వంటి సమస్యలపై మహిళలు నిరసనలు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు, అని మండిపడ్డారు. నియోజకవర్గానికి రావాల్సిన నిధులు విడుదల అయ్యే వరకు, రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చే వరకు, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన పనులు పూర్తి అయ్యే వరకు పోరాటం కొనసాగుతుంది, అని మెచ్చా నాగేశ్వరరావు హెచ్చరించారు. తక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రజా వ్యతిరేక పాలనగా భావించి బిఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో వందేమాతరం ర్యాలీ



కారేపల్లి, మహా: స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కారేపల్లి లో శుక్రవారం ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు స్థానిక బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిందని అందులో భాగంగానే స్థానిక బస్టాండ్ సెంటర్లో మానవహారంతో పాటు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. వందేమాతర గేయాన్ని నవంబర్ 7,1975న బంకిం చంద్ర చటర్జీ రచించారన్నారు ఈ గేయం తొలిసారి చటర్జీ రాసినా – ఆనంద్ మఠ్ నవలలో ప్రచురుతమైనదని అన్నారు. కారేపల్లి ఎస్సై బైరు గోపి, పోలీస్ సిబ్బంది, ఎంపీడీవో పి శ్రీనివాస్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఆర్డబ్ల్యూఏఈ నరేందర్ రావు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతర గీతం ఆలాపన



**బోనకల్ మహా:** 150వ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ నళిని అధ్యక్షతన వందేమాతర గీతాన్ని ఆలపించ చటం జరిగింది. వందేమా తరం గీతం యొక్క ప్రాము ఖ్యత గురించి ప్రిన్సిపల్ నళిని శ్రీ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి. తిరుపతి రావు. వారు మాట్లాడుతూ బకింగ్ చంద్ర చట్టోపాధ్యాయ్ వందేమాతర గేయాన్ని 1870 ప్రాంతంలో సంస్కృతం మరియు బెంగాలీ భాషల మిశ్రమంలో రాశారు. వందేమాతరం అంటే తల్లికి వందనం భరతమాతకు అర్పించిన ఒక గాఢమైన గౌరవం ప్రేమ మరియు దేశభక్తి గేయం. తరువాత ఆయన ఈ గేయాన్ని తన ఆనందమఠం గ్రంథములో 1882 వ సంవత్సరంలో ప్రచురించారు. మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వందేమాతరం గేయంలో గాఢతను గుర్తించాడు, 1896 కలకత్తాలో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఠాగూర్ స్వయంగా వందేమాతరం గేయానికి బాణీ కట్టి ఆలపించాడు. బకింమ్ చంద్ర చటర్జీ (1895) మరణానంతరం ఈ గేయం ఆవశ్యకతను దేశం అర్థం చేసుకుంది.

## అమరవీరుల సంస్మరణ సభలు



**కారేపల్లి, మహా:** సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో మాధారంలో జరిగిన సంస్మరణ సభలో ఆ పార్టీ కేంద్రరాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, గౌని ఐలన్నలు మాట్లాడారు. అసమానతలు లేని సమాజంకోసం ఎందరు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. పేదలకు భూమి కొరకు భుక్తి కొరకు పోరాడిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. మాస్ లైన్ ఆధ్వర్యంలో తొడితలగూడెం, మాధారం గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో మాస్ లైన్ జెండాలను ఎగరవేసి అమరవీరులకు జోహార్లు అర్పించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల ఆశోక్ మాట్లాడారు. ఈకార్యక్రమాలలో న్యూడెమొక్రసీ నాయకులు వై.ప్రకాశ్ కోలా లక్ష్మీనారాయణ, కోయిల శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాసరెడ్డి, కుర్ర శ్రీను, వై.జానకీ, గడ్డం వెంకన్న, కాలేటి నాగేశ్వరరావు, అలెం చంద్రయ్య, మాస్ లైన్ నాయకులు పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వి. రాకేష్, మాస్ లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, నాయకులు వేములపల్లి వీరన్న, కొయ్యల శ్రీనివాస్ బిక్కసాని భాస్కర్, అంబటి వెంకటేశ్వర్లు, శ్రీను రంగ్య, కనకరాజు, సోనీ, జోగ నాగేశ్వరరావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్





**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జిల్లా జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల స్థాయి విద్యార్థులకు చెకుముకి ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. మూఢనమ్మకాలు నమ్మకూడదని, సైన్స్ పరిజ్ఞానం మీద పరిసరాల పై మంచి అవగాహన కలిగి సాంకేతికపరమైన విద్యను అలవర్చుకొని రాణించాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 21వ తారీకున పాఠశాలలో మండల స్థాయి చెకు ముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం జరిగిన ప్రతిభ పరీక్షల్లో సుమారుగా 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరపనేని శాంత కుమారి, రామిశెట్టి శ్రీనివాసరావు, పి రామనాథం, ఎన్ గురుమూర్తి, జి వెంకటేశ్వర్లు, ఎం ఉమా, పి మహేశ్వరి, బి సునీత, వి శకుంతల పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అప్రమత్తం

- జీవనశైలిలో మార్పులు తీసుకొస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం
- ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ
- పేపర్ కప్స్, ప్లేట్ల వాడకంతో ప్రమాదాలు
- ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయించవచ్చు
- అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డా. రామారావు



**ఖమ్మం, మహా:** జాతీయ క్యాన్సర్ నివారణ అవగాహన దినం సందర్భంగా అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డా. డి. రామారావు ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ, దాని నివారణకు అనుసరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. జీవనశైలిలో చిన్న మార్పులు, సరైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమతో కూడిన ఆరోగ్య జీవన విధానాన్ని అవలంబించడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధిని దూరంగా ఉంచవచ్చని తెలిపారు.

### ఒక్కరోజులో వచ్చే వ్యాధి కాదు

డా. రామారావు మాట్లాడుతూ, క్యాన్సర్ అనేది ఒక్కరోజులో కలిగే వ్యాధి కాదని, దీని వెనుక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ కాలుష్యం, వంశపారంపర్య కారణాలు ప్రభావం చూపుతాయని చెప్పారు. పొగ త్రాగడం (ధూమపానం), మద్యపానం, పోగాకు నమలడం వంటి అలవాట్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణాలుగా ఉన్నాయని వివరించారు. ఇవి పూర్తిగా మానుకోవడం ద్వారానే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు.

### ఆరోగ్యకర ఆహారం.. రక్షణశక్తి పెంచే మార్గం

తీసుకునే ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, పీచు అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం శరీర రక్షణశక్తిని పెంచి వ్యాధి నిరోధకతను అందిస్తుందని చెప్పారు. బేకరీ పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్, బయట రోడ్లపై అమ్మే తినుబండారాలను తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### మానసిక సమతుల్యతకు మూలాధారం యోగా

ప్రతి రోజు కనీసం 30 నిమిషాల శారీరక శ్రమ, యోగ, ధ్యానం ద్వారా ఒత్తిడి (స్ట్రెస్) తగ్గించుకోవచ్చని, ఇది హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుందని ఆయన చెప్పారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగవ్వడమే కాక, శరీర రక్షణశక్తి కూడా పెరుగుతుందని వివరించారు.

### మహిళల సమగ్ర ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం

తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళల సంపూర్ణ ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకుని, ఎనిమిది ప్రధాన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నట్లు డా. రామారావు వివరించారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళలకు ఉచితంగా ప్రత్యేక వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం కింద మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 57 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో చికిత్సలను అందిస్తున్నారని చెప్పారు.

### గుర్తింపు ..ప్రాణరక్షణకు కీలకం

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స సులభం అవుతుందని, రోగి పూర్తిగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డా. రామారావు చెప్పారు. ప్రజలు క్యాన్సర్ లక్షణాలను చిన్నచూపు చూడకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవాలని సూచించారు.

### పేపర్ కప్స్, ప్లేట్ల వాడకంలో ప్రమాదాలు

ఇటీవల కాలంలో పేపర్ కప్స్, పేపర్ ప్లేట్ల వాడకం పెరిగిందని, వీటిని తయారు చేసే సమయంలో ఉపయోగించే రసాయనాలు ఆహార పదార్థాల్లో కలిసిపోవడం వల్ల విషపదార్థాలు శరీరంలో చేరి క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీస్తున్నాయని హెచ్చరించారు. పర్యావరణానికి అనుకూలమైన, పునర్వినియోగపరచదగిన పాత్రలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు.

### క్యాన్సర్ నిర్ధారణకు ఆధునిక పరీక్షలు అవసరం

క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడానికి, నిర్ధారించడానికి శారీరక పరీక్షలు, రక్తపరీక్షలు (ట్యూమర్ మార్కర్లు), ఇమేజింగ్ పరీక్షలు బయాప్సీ, ఎండోస్కోపీ, జన్యు పరీక్షలు ముఖ్యమని ఆయన తెలిపారు. అంతేకాక, సాధారణ స్క్రీనింగ్ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ కోసం మమోగ్రఫీ, గర్భాశయ క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్ష, పెద్దప్రేగు క్యాన్సర్ కోసం పెద్దప్రేగు దర్శిని వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్



**ఇల్లందు, మహా:** డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "చైతన్యం – డ్రగ్స్ పై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. పట్టణంలోని జెకె నుంచి కొత్త బస్టాండ్ వరకు జరిగిన ఈ రన్‌లో ఇల్లందు సబ్ డివిజన్ పోలీసులు, యువత, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి చంద్రభాను మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. డ్రగ్స్ సేవించడం, విక్రయించడం, సరఫరా చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును చెడగొట్టుకోవద్దని పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు శ్రీనివాస్ రెడ్డి, హసీనా, నాగుల్ మీరా, సూర్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాణాల పైన పర్సంటేజీ రాజ్యం!

**ఖమ్మం బ్యూరో, మహా:** ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యుల సేవ, మానవత్వం, నిబద్ధత అనే పదాలకు ప్రతీకగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇప్పుడు వ్యాపార దాహంతో దహనమవుతోంది. వైద్యం నారాయణో అనే శాస్త్రోక్త భావం, ఈ రోజుల్లో నగదే హరి అనే దందా ధోరణిగా మారిపోయింది. ప్రతి ఆసుపత్రి గోడల వెనుక లాభాల లెక్కలు మోగుతున్నాయి, ప్రతి రోగి ప్రాణం కమీషన్ లెక్కల్లో కొలుస్తున్నారు. ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రతి పట్టణంలో ప్రైవేట్ హాస్పిటల్‌లు పుట్టెడు బొంగురుగా పెరిగాయి. కానీ పెరిగింది సేవ కాదు, పెరిగింది దోపిడీ ధోరణి. పేదలకు సేవ అనే బోర్డు వేసిన హాస్పిటల్ లోపల పర్సంటేజ్ లెక్కలు వేసే డాక్టర్లు, మేనేజ్‌మెంట్ ముఠాలు, ఆర్.ఎం.పి.లు నడిపే కమిషన్ రాకెట్.. ఇవే ఇప్పుడు వైద్య రంగం యొక్క అసలు ముఖచిత్రం. ఇక్కడ రోగి ప్రాణం కన్నా బిల్లులో అంకెలు ముఖ్యం. ల్యాబ్‌లలో టెస్టుల పేరుతో లూటీ, ఆసుపత్రులలో ట్రీట్మెంట్ పేరుతో దోపిడీ, అధికారుల నిర్లక్ష్యం ఇవన్నీ కలసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్యరంగాన్ని మృగరాజ్యంగా మార్చేశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్.ఎం.పి.లే వైద్యరంగానికి గేట్‌కీపర్లు. ప్రజల నమ్మకాన్ని వాడుకుని, ప్రైవేట్ ఆసుపత్రుల కమీషన్ నెట్‌వర్క్‌లో భాగమైపోయారు. ఒక ఆసుపత్రి 50%, ఇంకోది 60% కమిషన్ ఇస్తే రోగులను ఆ దిశగా లారీలలో లోడ్లు పంపినట్లు పంపిస్తున్నారు. రోగి పరిస్థితి ఏదైనా సరే, ఆర్.ఎం.పి.కు లెక్క ఒక్కటే "ఏ హాస్పిటల్ ఎంత పర్సంటేజ్ ఇస్తుంది?". దీనివల్ల చాలామంది పేదలు సగం చికిత్సకే సర్వం కోల్పోతున్నారు. ఇదే సమయంలో కొంతమంది హాస్పిటల్ యజమానులు




ఈ పర్సంటేజ్ దందాను సుస్థిరమైన వ్యవస్థగా మార్చుకున్నారు. గ్రామాల్లోని ఆర్.ఎం.పి.లకు టార్గెట్‌లు ఇస్తారు. నెలకు కనీసం 10 రోగులు తీసుకురావాలని. అది చేయకపోతే కమిషన్ నిలిపేస్తామని బెదిరిస్తారు. ఇది వైద్యం కాదు.. ఇది ప్రాణాల వ్యాపార వ్యవస్థ.

## ల్యాబ్‌లలో లూటీ...టెస్టుల పేరుతో రక్తదోపిడీ

ఖమ్మం, పాల్వంచ, కొత్తగూడెం, వైరా, సత్తుపల్లి, మణుగూరు, భద్రాచలం ప్రాంతాల్లో ప్రతి వీధిలో ల్యాబ్‌లు కూకటివేళ్లలా ఉన్నాయి. వీటిలో చాలావరకు ప్రైవేట్ హాస్పిటల్‌ల సొంతం. ప్రతి టెస్టుకు ఫిక్స్‌డ్ పర్సంటేజ్ ఉంటుంది. బ్లడ్ టెస్ట్ ?500 అంటే, రోగి చెల్లించేది ?1,200. మధ్యలో వెళ్ళేది ల్యాబ్ అసిస్టెంట్, ఆర్.ఎం.పి., మరియు హాస్పిటల్ యజమానుల జేబుల్లో.

రోగికి సాధారణ జ్వరం వచ్చినా "మీ లివర్, కిడ్నీ, థైరాయిడ్ చెక్ చేయాలి" అంటూ దర్జాగా టెస్టులు సూచిస్తారు. భయంతో రోగి టెస్టులు చేయించుకుంటాడు. చివరికి బిల్లు చూసి బుర్ర తిరుగుతుంది. ఈ టెస్టుల వ్యాపారం ఖమ్మం జిల్లాలో బంగారు బావులా మారింది.

## బోర్డుపై తీపి మాటలు..బిల్లో మంటలు

ప్రైవేట్ ఆసుపత్రుల బోర్డులు చూస్తే "తక్కువ ఛార్జీలు, అధిక సేవలు" అని మెరిసిపోతాయి. కానీ లోపల మాత్రం బోర్డుపై మిఠాయి ..బిల్లో మిరపకారం స్థాయిలో దోపిడీ సాగుతోంది. ఒక డెలివరీ కేసు బిల్లులో ?25,000 అని రాసి, డిస్చార్జ్ సమయంలో ?65,000 వసూలు చేయడం సర్వసాధారణం. "టెస్టులు ఎక్కువయ్యాయి", "పేషెంట్ కాంప్లికేషన్ పెరిగింది" అంటూ బిల్లులు పెంచేస్తారు. బాధితులు బిల్లు చెల్లించకపోతే డిస్చార్జ్ ఇవ్వకుండా బంధిస్తారు. ఇది చికిత్స కాదు..చట్టం మీద దౌర్జన్యం. అధికారుల నిర్లక్ష్యం ఈ దందాకు కవచం అయింది.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ప్రైవేట్ నీడ

ప్రభుత్వ ఆసుపత్రులు ఒకప్పుడు పేదలకు ఆశగా ఉండేవి. కానీ ఇప్పుడు అక్కడ కూడా ప్రైవేట్ ప్రభావం చాపకింద నీరులా పెరిగింది. కొంతమంది ఔట్‌సోర్స్ సిబ్బంది, కమీషన్ ఆశతో రోగులను ప్రైవేట్ వైపు నడిపిస్తున్నారు.ఇక్కడ సదుపాయం లేదు.. బయట హాస్పిటల్‌కి వెళ్ళండి" అంటూ తమ సొంత లాభాల కోసం రోగులను దారి మళ్లిస్తున్నారు. ఈ ప్రైవేట్ లింకులు ప్రభుత్వ వైద్య వ్యవస్థను గుప్తంగా దెబ్బతీస్తున్నాయి.

ఇలా కొనసాగితే ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల నమ్మకాన్ని కోల్పోతాయి, పేదలకు వైద్యం 'హక్కు' కాకుండా 'భారం' అవుతుంది.

### ట్రస్టు పేరుతో ట్రాప్..

కొన్ని ప్రైవేట్ హాస్పిటల్‌లు ఇప్పుడు "ట్రస్టు", "సేవా ఫౌండేషన్" పేర్లతో కొత్త ముసుగులు తొడుక్కున్నాయి. "పేదలకు ఉచిత చికిత్స" అంటూ ప్రచారం చేస్తూ, ప్రభుత్వ నిధులు తీసుకుంటూ, ఆ డబ్బును కూడా పర్సంటేజ్ లెక్కల్లో దోచేస్తున్నారు. ఈ ట్రస్టు దందా వల్ల ప్రభుత్వ బడ్జెట్ పేదల వద్దకు కాకుండా హాస్పిటల్ యజమానుల లెక్కల ఖాతాల్లో చేరుతోంది. ఇది సేవ కాదు..సొమ్ము సాధన శాస్త్రం.

### లాభాల నీడలో వ్యవస్థ మౌనబద్ధం

ఖమ్మం జిల్లాలోని ప్రజలు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. "ఆరోగ్యశాఖ అధికారులు ఎక్కడున్నారు?" వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు పలు సమావేశాలు నిర్వహించినా, పర్సంటేజ్ దందాపై చర్యలు మాత్రం గాలిలో కలిసిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ ఆసుపత్రులు ఈ స్థాయి దోపిడీ చేయగలుగుతున్నాయని ప్రజలు బహిరంగంగా అంటున్నారు. "ప్రజల ప్రాణాలపై మౌనం అంటే అది పరోక్ష మద్దతే కాదా?" అని ఖమ్మం ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

---

## పత్తి కొనుగోలు నిబంధనలు ఎత్తివేయాలి

**ఖమ్మం సిటీ, మహా:** కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు నిబంధనలు ఎత్తివేయాలని, అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని, రబీ సీజన్ సన్న ధాన్యం బోనస్ 63 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ, సిసిఐ పత్తి కొనుగోలు నిబంధనలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. తేమ శాతం 8%-%12 శాతం మధ్య ఉండాలని, ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని ఉన్న నిబంధనలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో పత్తి దిగుబడులు తీవ్రంగా తగ్గాయని, సిసిఐ నాణ్యత ప్రమాణాలు సడలించి పత్తిని మద్దతు ధర రూ.8110కు కొనుగోలు చేయాలని కోరారు.

---

## గైర్హాజరు సర్క్యులర్ ఉపసంహరించాలి

**మణుగూరు, మహా :** సింగరేణి యాజమాన్యం ఇటీవల జారీ చేసిన గైర్హాజరు సర్క్యులర్ కార్మికుల గుండెల్లో భయాందోళనలు పుట్టిస్తున్నదని మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చీకటి గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి శ్రమిస్తున్న కార్మికులను నిరుత్సాహపరిచే విధంగా 150 మస్టర్‌ల నిబంధన విధించడం సరికాదన్నారు. గతంలో 100 మస్టర్‌లతో మూడు సంవత్సరాల లోపు గైర్హాజరైతేనే చర్యలు తీసుకునేవారని, ఇప్పుడు ఏడాదికే 150 మస్టర్‌లు పూర్తి చేయకపోతే వార్నింగ్‌లు, చార్జిషీట్లు, ఇంక్రిమెంట్ల కోత వంటి చర్యలు తీసుకోవడం మానవీయ కోణానికి విరుద్ధమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల శ్రమను గుర్తించి యాజమాన్యం మానవతా దృష్టితో పాత సర్క్యులర్‌లను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

---

## సామినేని జ్ఞాపకాల్లో మునిగిపోయిన పాతర్లపాడు

**చింతకాని, మహా:** నలభై ఏళ్లకుపైగా ప్రజా పోరాటాల సాక్షిగా నిలిచిన చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామం, నేడు తన ప్రియనేత సామినేని రామారావును గుర్తు చేసుకుంటూ మౌనంలో మునిగిపోయింది. ప్రజాసేవను జీవిత ధ్యేయంగా చేసుకున్న ఈ కమ్యూనిస్టు నాయకుడి హత్యతో గ్రామం చీకటిలో మునిగినట్లు మారింది. ఎర్రజెండా నీడలో పేదవాడి ఆశ్రయంగా నిలిచిన ఆయన జ్ఞాపకం, నేడు ప్రతి ఇంటి గుండె చప్పుడు లా మారింది. 1980ల కంటే ముందే కమ్యూనిస్టు ఉద్యమాలకు పంచుకోటగా మారిన మధిర నియోజకవర్గంలో, సామినేని రామారావు ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభించి, ప్రజా పోరాటాల వేదికలపై అగ్రగామిగా ఎదిగారు. రైతు, కూలీ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి, అనేక సార్లు ప్రజలతో రోడ్డుపైకి వచ్చి, ప్రభుత్వాల తలలు తిప్పేలా చేసిన ఉద్యమాలు ఆయన పేరుతో ముడిపడి ఉన్నాయి. చింతకాని మండలంలో సిపిఎం పార్టీకి పునాదులు వేయడంలో ఆయన కృషి అపారమని పార్టీ నేతలు నేటికీ గుర్తుచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల వెనుకబాటుతనాన్ని చూసి, ప్రజా సంక్షేమం కోసం రాజకీయాల్లో అడుగుపెట్టిన రామారావు గారు, సర్పంచ్‌గా ఎన్నో పథకాలు అమలు చేశారు. చెత్త రహదారుల స్థానంలో కొత్త రహదారులు, తాగునీటి బోర్లు, గ్రామ విద్యా సంస్థలకు సదుపాయాలు %-% ఇవన్నీ ఆయన కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. అభివృద్ధి అన్నది కేవలం నిర్మాణం కాదని, అది ప్రజా భాగస్వామ్యంతో సాకారం కావాలని ఆయన



### రేపు సంస్మరణ సభ ..హాజరుకానున్న సిపిఎం నాయకులు

సామినేని రామారావు స్మారకార్థం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రేపు పాతర్లపాడులో సంస్మరణ సభ జరుగనుంది. ఈ కార్యక్రమానికి జాతీయ నాయకుడు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీ, నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు హాజరుకానున్నారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ప్రజల పక్షాన గళమెత్తిన, రైతు కూలీల పక్షాన నిలిచిన, పేదవాడి నేస్తంగా జీవించిన సామినేని రామారావు గారు నేడు లేరు. కానీ ఆయన చేసిన సేవలు, చూపిన మార్గం, కలిగించిన చైతన్యం మాత్రం పాతర్లపాడును శాశ్వతంగా ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆయన జీవితం ఎర్రజెండా కింద నడిచిన త్యాగానికి, ప్రజా ప్రేమకు, సత్య నిబద్ధతకు ప్రతీకగా నిలిచిపోతుంది.

విశ్వసించారు. పార్టీకి కట్టుబడి, పేద వర్గాలకు అండగా నిలిచి, జీవితం మొత్తాన్ని సామాజిక న్యాయానికి అంకితం చేశారు సామినేని రామారావు. దళితులు, బడుగు వర్గాల సమస్యలను స్వంతవిగా భావించి, వారి కోసం భూములను పంపిణీ చేసిన ఆయన దాతృత్వం నేటికీ గ్రామంలో ఆదర్శంగా నిలిచింది. స్వంత పన్నెండు ఎకరాల భూమిని పేద కుటుంబాలకు అందించి, వారికి గూడును ఏర్పాటు చేసిన ఉదారత, ఆయన మనసులోని మనిషితనాన్ని చాటుతుంది. ఏడు దశాబ్దాల వయసులోనూ రామారావు గారు రాజకీ యాల కన్నా ప్రజలతో జీవించడం ఇష్టపడ్డారు. వ్యవసాయం చేస్తూ, గ్రామంలో సాదాసీదా జీవితం గడిపిన ఆయన, తాను నమ్మిన సిద్ధాంతాలకు మచ్చ రానీయకుండా జీవితం ముగింపు దశలో కూడా ప్రజల మధ్యనే ఉన్నారు. అయితే అక్టోబర్ 31 తెల్లవా రుజామున జరిగిన ఆయన హత్య సంఘట నతో గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. ఆ మృత్యువుతో పాతర్లపాడు నిశ్శబ్దంగా మారింది. రాజకీయాల్లో విరోధులు ఉన్నా, ప్రజల మనసుల్లో "రామారావు గారు" అనే గౌరవ స్థానం పొందిన ఆయన మరణం పాతర్లపాడు మాత్రమే కాక, మొత్తం చింతకాని మండలానికి గాయం చేసింది. హత్య వెనుక ఉన్న కారణాలు ఇంకా మిస్టరీగానే ఉండటం ప్రజల్లో ఆవేదన రేపుతోంది. "ఒక మంచి మనిషిని కోల్పోయాం" అని గ్రామస్తులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.